# సిల్కు రూట్‌లో సాహస యాత్ర

తెలుగులో యాత్రాగ్రంధాలు (ట్రావెలాగ్స్) రాయడం, రావడం అరుదు, శ్రీ పరవస్తు లోకేశ్వర్ 'సిల్కు రూట్‌లో సాహస యాత్ర'తో ఆ లోటును కొంత భర్తీ చేశారు. ఆయనకి 'ఏం తింటున్నామన్న దాని కన్నా ఎంత తిరుగుతున్నాం, ఎన్ని చూస్తున్నాం అన్నదే ముఖ్యమైపోయిం'దట. పూర్వీకుల నుంచి సంక్ర మించిన భ్రమణంతోపాటు బహుశ కాళ్ళకు చక్రాలు కట్టుకునే పుట్టి వుండవచ్చాయన. అందుకే 'నడక నా ప్రాణం రోడ్లకు నా నమస్కారం.' మహామహోపాధ్యాయ రాహుల్ సాంకృత్యాయన్, తెన్నేట సూరి రచన చెంఘీజ్ ఖాన్, చెంఘీజ్ ఐత్ మాతోవ్ రచనలు ఆయన మీద ప్రభావం చూపించి ఉజ్బెకిస్తాన్, కిర్గిజ్‌స్తాన్, చైనాలలో వంటరిగా జరిపిన సుదీర్ఘ యాత్రా విశేషాల్లో – పురాతన కట్టడాలని, శిధిలావశేషాల్ని చూస్తూ వేలాది సంవత్సరాల చరిత్రని, భిన్న సంస్కృతులని, నాగరికతలని, జనజీవన విధానాలని అన్వయించి వాటితో తన అనుభవాల్ని జోడిస్తూ చక్కటి శైలిలో రూపొందించి అందించడం ప్రశంసనీయం. చరిత్ర లోనూ, సాహిత్యంలోనూ మంచి పట్టు వున్నందుకు సాధికారంగా సాగిన రచన పాఠకులకి విందు భోజనం. ఇప్పటి చైనాను చూసి 'ఏవి తల్లీ నిరుడు కురిసిన విప్లవ నినాదాలు', 'కన్స్యూమరిజంలో కాలం చెల్లిన కమ్యూనిస్టు ప్రవచనాలు', 'పిట్టలు లేవు పిట్ట కథలు లేవు' అంటారాయన.

అందరం మార్కోపోలో, ఫాహియాన్, హుయాన్‌త్సాంగ్ యాత్రా విశేషాల గురించి విన్నా లోతుగా పరిశీలించిన వారు అరుదు. జవహర్‌లాల్ నెహ్రూ హయాములో చౌ–ఎన్–లై రావడంతో పంచ శీల, హింది–చీనీ భాయ్ భాయ్ వంటివి; బుల్గానిన్-కృశ్చేవ్‌ల ఆగమనంతో కొంతవరకు రష్యా గురించి అవగాహన; ఆ తరవాత కల్చరల్ ఎక్స్ఛేంజిలో భాగంగా ఉజ్బెకిస్తాన్ కళాకారులు మన దేశానికి రావడం; మరికొంత పరిజ్ఞానం సోవియట్ భూమి వల్ల కలగడం; లాల్ బహదూర్ శాస్త్రి తాష్కెంట్‌లో ఆకస్మిక మరణం – వంటివి మాత్రమే మధ్య ఆసియా గురించి మనకు అవగతం. ఒకప్పటి రష్యాలో యిన్ని విభిన్న సంస్కృతులు, నాగరికతలు; క్రీస్తు శకానికి పూర్వమే కుమారజీవుని వల్ల బౌద్ధమత విస్తృతం లాంటివి ఈ యాత్రాగ్రంధంలో చదివి తెలుసుకోవలసిందే.

ఉజ్బెకిస్తాన్‌లో మొదలై కిర్గిజ్‌స్తాన్ మీదుగా చైనా వరకు సాగిన 55 రోజుల వంటరి యాత్రలో భాష తెలియక పడిన యిబ్బందులు, ('భాష రానిచోట హృదయభాష ఎప్పుడూ వుంటుంది') మూగ భాషలో (సైగలతో) సంభాషణలు, అపరిచితుల సాన్నిహిత్యం, ఎడారిలో ఒంటె మీద ప్రయాణం చేస్తూ 'అలను లేని కొలనులో సడి చేయని పడవలా నెమ్మదిగా నడుస్తున్న ఒంటెను అధిరోహించి దాని పాదాల క్రింద ఇసుక రేణువుల శబ్దాన్ని వినడం ఒక వింతైన అనుభూతి, అనుభవం' మనకు అందించారు. ఎడా రిలో యిసుక తుపానుని బస్సు అద్దాల్లోంచి చూసి, తుపాను ఆగిన తరవాత 'సాయం సంజెవేళ తుపాను

ఆగింది కాని పడమటి సంధ్యారాగంలో ఎడారి సుందరి కొత్త అందాలను సంతరించుకుంది. వన్నెవన్నె చీరలు ధరించినట్లు వొంపుసొంపుల ఇసుక దిబ్బలు వివిధరంగులలో కాంతులీనుతున్నా'యని అందంగా వివరిచడం హృద్యం.

ఒకప్పుడు బౌద్ధమతం చైనా వరకు విస్తరించిన వుదంతం తెలియపరుస్తూ, 'ఏ హిందూ మతానికి, ఏ బ్రాహ్మణత్వానికి వ్యతిరేకంగా జీవితాంతం వుద్యమించాడో అదే మతం, అదే తత్వం చివరికి లౌక్యంగా ''పదవ అవతారంగా'' తనలో లీనం చేసుకుని మిగిలిన బౌద్ధాన్ని దేశం నుండి ఇతర దేశాలకు తరిమేస్తే మొత్తం ఆసియా ఖండానికే వెలుగుబాట వేసి వేగుచుక్కగా మారిపోయింది' అన్న సత్యాన్ని చక్కగా వివ రించారు. అప్పట్లో శ్రీనగర్, అమృత్‌సర్‌ల నుంచి అనేకమంది సాహసంతో ప్రాణాలకు తెగించి వచ్చిన భారతీయ వ్యాపారస్తులు, వడ్డీ వ్యాపారులు స్థిర నివాసాలు ఏర్పరచుకున్నందుకు ఆ కాలంలో వారిని మిగతా ప్రజలు 'మహాజనులు' అని పేర్కొంటే చివరికది ఉత్తర భారతదేశంలో 'మహాజన్' అని యింటి పేరుగా మారిందట.

ఒకవైపున తను కన్న కలలు తీర్చుకుంటూ అక్కడి విశేషాలు యిలా మనతో పంచుకుని ఆ ప్రదే శాల్లోని సామాజిక జీవనంతోపాటు తన యిష్ట రచయిత చెంఘీజ్ ఐత్ మాతోవ్, 15వ శతాబ్దపు కవ యిత్రి, సంగీతంలో కొత్త ప్రయోగాలు చేసిన అమనిషాన్ ఖాన్  చైనాలోని ఉగైర్ ప్రాంతానికి రాణి ('ఉగైర్ కి షాన్ ఔర్ నిషాన్') అని రాసింది చదువుతుంటే ఆ పేర్లు ఎప్పుడూ వినని నా అజ్ఞానం బయటపడింది. తీన్‌షాన్ (చైనా) ప్రాంతపు లోయల్లో నడుస్తుంటే – 'క్రింద ఇసుకనీటిలో తపతపా పడుతున్న పాదాల శబ్దాలు నిశ్శబ్ద ఏకాంతాన్ని భగ్నపరిచే క్షణాలు. పర్వత పాదాల చెంత తలలు  బాదుకుని బద్దలు కొట్టు కునే సౌందర్య దాహం. అద్వైతం. తాదాత్మ్యం. ఒక తృష్ణ. ఒక కాంక్ష. అచరిత్రకాలంలో ఆదిమకాలం నాటి పురాగృహయానం. ఒకానొక అలౌకిక చిదానంద స్థితికి జారిపోయిన క్షణాలు' అయినాయి రచయితకి. తక్లమ్‌కాన్ (చైనా) ఎడారిలో 'నా నవయవ్వనంలో నే చదివిన చెంఘీజ్ ఖాన్ నవలలో గాలి దుమారంలో పరిగెత్తే మంగోల్ గుర్రాల కాలి గిట్టల అడుగుజాడల ఆనవాళ్ళ కోసం ఆ ఎడారి యిసుకలో అన్వేషించా ను' అన్నది కలలు నెరవేరిన సమయం.  'మసీదు దర్వాజా తలుపు గొళ్ళానికి తళతళా మెరిసే పాతకాలం రాగితాళం కాలానికే కాపలా' అట.

ఓష్ (కిర్గిజ్‌స్తాన్) నగరాన వున్న డోమ్ బాబ్‌రా మసీదు చాలా ఎత్తున, యిరుకైన మెట్లతో వుండటం చూసి 'కంటికి దూరమైతే కాలికి దూరమా' అనుకుంటూ కష్టపడి ఎక్కుతుంటే అనేక భావనలు ఆయన్ని చుట్టుముట్టాయి. 'మనల్ని మనం తెలుసుకోవాలంటే మన లోపలి నిగూఢ శక్తుల్ని బహిర్గతం చేసుకోవాలంటే ఇటువంటి కఠినతరమైన సాహసయాత్రల్ని చేయాలనిపించిది. ఈ అనుభవాల సారంతో మనం మరింత పదును తేరుతాం. మనల్ని మనం మెరుగులు దిద్దుకుంటాం. ఈ యాత్రలు కూడా ఒక

రకమైన ఆత్మావలోకనాలే. ప్రకృతి ఒడిలో ప్రయాణించటం అంటే మన ఆంతరంగిక ఆత్మలోకాలలోకి కూడా ప్రయాణించడమే', అవును కదా!

చిన్నప్పుడు చదివిన చెంఘీజ్ ఖాన్ నవలలో పరిచయమైన యూర్త(గుండ్రటి గుడారం)ని తాష్ రబాత్ (కిర్గిజ్స్తాన్) మైదానంలో చూసి దాంట్లో ఓరోజు రాత్రి బస చేసినప్పుడు – 'అసలు ఈ యూర్తల కోసమే, ఈ ఎడారులలో పరిగెత్తే గుర్రాల కోసమే, వాటి గిట్టల పదఘట్టనల లయబద్ధమైన చప్పుడు వినడం కోసమే కాదా నేను ఇట్లా మధ్య ఆసియా దేశాల సంచారానికి దేశదిమ్మరిగా వచ్చింది. నా స్వప్న సాకార సమయం ఆసన్నమైన వేళ అది! పుస్తకాలు అందరూ చదువుతారు కాని అందులోని ప్రదేశాల అన్వేషణ కోసం, ఆ అక్షరాల అడుగుజాడలలో ఆ బాటలలో నడిచే అదృష్టం కొందరికే దక్కుతుంది. ఆ కొందరిలో నేనొక్కడిని' అనుకుంటూ దాంట్లో పడుకుని – 'ఇచ్చోటనే కదా మార్కోపోలో కూడా నిద్రించి నది అని నాలో నేనే గర్వపడుతూ .. ఈ దుస్సాహసిక ప్రయాణాల అంతిమలక్ష్యం, ఆఖరి గమ్యం బాహ్య, భౌతిక ప్రపంచాలకా లేక ఆంతరంగిక ఆత్మలోకాల్లోపలికా అనే తర్క వితర్క' మీమాంసలో మునిగి పోయారు.

కరీంనగర్‌కు చెంది బిష్కెక్ రాజధానిలో సెటిలయిన డాక్టరుగారు రచయిత చూడదలుచుకున్న ప్రదేశాలన్నీ చూడటానికి 15, 20 రోజులు పడుతుందని, టేక్సీ ప్రయాణం వగైరాలు మన కరెన్సీలో 70, 80 వేల రూపాయలవుతుందని చెబితే, 'అయ్యా నేను టూరిస్టును కాను ట్రావెలర్‌ను. డబ్బు సంగతి కాదు కాని సీదాసాదాగా సామాన్యుడిగా ఎంత తక్కువ ఖర్చు చేస్తే అంత ఎక్కువగా అనుభవాలు పొందగలను, నా ప్రయాణాలలో ప్రపంచాన్ని అతి దగ్గర నుండి చూడగలను, అర్థం చేసుకోగలను. కావున నన్ను సర్కారు వారి ఎర్రబస్సు ఎక్కించండి' అని వేడుకున్నారు. అలాగే ప్రయాణమంతా బస్సుల్లో, తప్పనప్పుడు షేర్డ్ టేక్సీల్లో జరిపి రకరకాల మనుషుల్ని కలిశారు. కిర్గిజ్స్తాన్‌లో యిష్టం లేకపోయినా తల్లిదండ్రుల బల వంతం మీద డాక్టరు పట్టా కోసం ఢక్కాముక్కీలు తింటున్న భారతీయ వైద్య విద్యార్థులు పడే యిక్కట్లు చూసి కేవలం డబ్బుతో విద్యని కొనాలనే వారి తల్లిదండ్రుల్ని గర్హిస్తారాయన. అక్కడ కలిసిన హైదరాబాదు పాతబస్తీకి చెందిన రఫీ ప్రకారం 'అంకుల్, ఇక్కడ ప్రతి విద్యార్థి జీవితం వెనుకా ఒక విషాదగాథ వుంది.'

హోటన్‌లో తారసపడ్డ అపరిచిత పాకిస్తానీ అన్నం తిన్నారా? అని ఉర్దూలో అడిగినప్పుడు ఆ ఆత్మీ యతకే కడుపు నిండిపోయిందట. అన్నట్టు లోకేశ్వర్‌గారి మరో కల పాకిస్తాన్ పర్యటించడం. ఎందుకంటే – 'ఐదువేల సంవత్సరాల మన ఘనచరిత్రంతా ఇప్పటి పాకిస్తాన్ భూభాగంతో ముడిపడి వుందన్న సంగతి మనం ఎట్లా మరిచిపోతాం? వొతో అప్నా దిల్ కా టుక్‌డా హై! హరప్పా, మొహెంజోదారోలే దానికి ప్రత్యక్షసాక్షి. ముల్తాన్ నదీ తీరాన ఋగ్వేదం పఠించిన సంగతిని ఎట్లా మరుస్తాం?' అయితే

రెండుసార్లు వీసా తిరస్కరించడంతో కల కలగానే మిగిలిందట. సుహృద్భావ వాతావరణం నెలకొని ఎప్పటికైనా వారికి వీసా లభించాలని ఆశిద్దాం.

రచయితకి యిష్టమైన ఉర్దూ, హిందుస్తానీ పదాలు, పంక్తులు – ప్రయాణంలో చోటుకాని చోట ఆయనకి పూటకూళ్ళ పెద్దమ్మ వడ్డించిన శర్కరపొంగలిలాంటి తియ్యటి పాయసంలో కలిపిన కుంకుమ పూవులా గుబాళిస్తాయి. ఇది యాత్రా విశేషం మాత్రమే కాదు, చరిత్రకి విల్ డ్యూరాంట్ పేరు పెట్టిన *ది స్టోరీ ఆఫ్ సివిలిజేషన్*.

ఇంటిపేరు సార్థకం చేసుకుంటూ రాసిన ఈ చక్కటి రచన అందరూ చదవాల్సినది.

– గబ్బిట కృష్ణమోహన్

29-01-2015